ప్రజాశక్తి

శుక్రవారం 11 ఆగస్టు 2023 5

శ్రీ సత్యసాయి

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను
ఘనంగా నిర్వహిద్దాం : కలెక్టర్

కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించడానికి అధికారులందరూ సిద్ధం కావాలని కలెక్టర్ అరుణ్ బాబు సూచించారు. గురువారం నాడు కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో వేడుకలకు సంబంధించి సమీక్షించి, దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ విష్ణు, డిఆర్ఒ కొండయ్య, ఆర్డీవో భాగ్యరేఖ సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 77వ స్వాతంత్ర్య వేడుకలు స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించేందుకు అధికారులు విజయవంతం అయ్యే విధంగా చూడాలని సూచించారు. ఎందరో త్యాగాల ఫలితంగా స్వాతంత్రం సిద్ధించిందన్నారు. దేశం ఎంతో ప్రగతి సాధించిందని రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. ముఖ్యంగా విద్య వైద్య రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తూ ఎన్నో కార్యక్రమాలు చేపట్టిందన్నారు. మన జిల్లా సాధించిన ప్రగతి నలుదిశల చాటే విధంగా ఏర్పాట్లు ఘనంగా చేపట్టాలన్నారు. అందుకు అనుగుణంగా పోలీస్ పెరేడ్‌ను సిద్ధం చేయాలని ఆరోజు తగిన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జయరాం జెండా ఎగురవేస్తారన్నారు. విఐపిలకు ప్రజలకు కూర్చోవటానికి ఏర్పాట్లు చేయాలన్నారు. శానిటేషన్, తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని ఆర్అండ్‌బి, రెవెన్యూ, మున్సిపల్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. విద్యుత్‌కు అంతరాయం కలవకుండా చూడాలన్నారు. అందుకు సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరికి ఏ ఇబ్బంది కలగకుండా చూడాలని, విద్యాశాఖ, గిరిజన సాంఘిక సంక్షేమ అధికారులు విద్యార్థులచే ప్రగతిని వివరించే విధంగా సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించాలన్నారు. ప్రభుత్వ శాఖల నుండి ప్రగతి నివేదికలను క్లుప్తంగా నివేదికలు ప్రణాళిక అధికారికి శుక్రవారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, డ్వామా పీడీ రామాంజనేయులు, హౌసింగ్ పీడీ చంద్రమౌళి రెడ్డి, వ్యవసాయ అధికారి సుబ్బారావు, డిఎంహెచ్ఒ కృష్ణారెడ్డి, సంబంధిత జిల్లా అధికారులందరూ పాల్గొన్నారు.

కళ్లకలక కలవరం

- ◆ ఉమ్మడి జిల్లాలో పెరుగుతున్న కేసులు
- ◆ చిన్నారులపై అధిక ప్రభావం
- ◆ వాతావరణ పరిస్థితులే కారణం
- ◆ జాగ్రత్తలు అవసరం అంటున్న వైద్యులు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత వారం తేలికపాటి వర్షాలు పడ్డాయి. గత రెండు రోజులుగానూ అక్కడక్కడ వర్షాలు పడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో పలు అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. ఇందులో ప్రస్తుతం కళ్లకలక వైరస్ జనాన్ని కలవర పెడుతోంది. ఈ సీజన్‌లో ప్రస్తుతం ఈ కేసులు పెరుగుతున్నాయి. ముఖ్యంగా దీని ప్రభావం చిన్నారులపై ఎక్కువగా పడుతోంది.

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇటీవలి కాలంలో కళ్లకలక కేసులు పెరుగుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. వర్షాల కారణంగా కండ్లకలక వంటి కంటి ఇన్ఫెక్షన్‌లు రావడం సహజమే అయినా, ఈ సారి దీని తీవ్ర ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. కళ్లకల జబ్బుతో ఆసుపత్రికి వెళ్లే వారి సంఖ్య పెరుగుతోంది. కళ్లకల వైరస్‌కు ఒకరి నుంచి మరొకరికి వ్యాప్తి చెందే లక్షణం ఉండడంతో రోజురోజుకు దీని బాధితుల సంఖ్య పెరుగుతున్నారు. పాఠశాలల్లో కళ్లకలక బారిన పడిన చిన్నారుల సంఖ్య పెరుగుతోంది. వాతావరణంలో మార్పులు, కెమికల్ రియాక్షన్, రసాయనాలు, వాహనాల పొగ, సౌందర్య ఉత్పత్తులు వాడకం, దుమ్ము, ధూళి, పెంపుడు జంతువులు, పుప్పొడి వల్ల కళ్ల కలక వస్తుందని వైద్యులు చెబుతున్నారు. అనంతపురంలోని ఓ ప్రయివేటు పాఠశాలలో ఒక తరగతిలోనే దాదాపు 15 మంది విద్యార్థులు ఈ వైరస్ బారిన పడ్డారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. వర్షాలు ఇలానే వస్తే కళ్లకలక వైరస్ బాధితుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ కళ్ల కలకల బాధితులతో ఓపి పెరిగింది. ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో అధికంగా ఉన్న ఈ వైరస్ పల్లెకు ప్రాకే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

కళ్లకలక లక్షణాలు

- ◆ కళ్లకలక వచ్చిన వారి కళ్లుఎరుపు రంగులోకి మారుతాయి.
- ◆ దురద, నీటితో నిండిన కళ్లు ఉంటాయి.
- ◆ నొప్పి, వాపు వంటి లక్షణాలు కన్పిస్తాయి.
- ◆ ఈ వైరస్ బారిన పడ్డవారిలో కొందరికి జలుబు, దగ్గు, జ్వరంతో లక్షణాలు కూడా ఉంటాయి.

జాగ్రత్తలు...చికిత్సా పద్ధతులు..!

- ◆ కళ్లకలక సులువుగా ఒకరినుంచి మరొకరికి వ్యాపిస్తుంది. కాబట్టి దీనిబారినపడ్డ వారు ఒంటరిగా జాగ్రత్తలు తీసుకుంటే మంచిది.
- ◆ కాంటాక్ట్ లెన్సులు వాడటం మానేయాలి. బయటకు వెళ్లాల్సి వస్తే కళ్లజోడు పెట్టుకుంటే మంచిది.
- ◆ నీరు తాగితూ.. హైడ్రేటెడ్‌గా ఉండాలి.
- ◆ కళ్లకలక లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి.
- ◆ అతిక మోతాదు డ్రాప్స్ వేసుకోవడం అంత మంచిది కాదు.
- ◆ వైద్యుని సలహా మేరకు కంటి చుక్కలు లేదా లూబ్రికెంట్లను ఉపయోగించాలి.
- ◆ కళ్లపై నీళ్లను చిమ్ముస్తూ, శుభ్రం చేసుకుంటూ ఉండాలి.

చూసినంత మాత్రాన రాదు..!

ఈ వ్యాధి ఉన్న వారి కళ్ల ల్లో కళ్లు పెట్టి చూసినంత మాత్రాన ఇది వ్యాపించదు. వారు వాడిన జేబురుమాళ్లు పట్టుకోవడం, తలగడలపై పడుకోవడం.. వాళ్లు కళ్లల్లో పెట్టుకున్న చేతులను మరొకరు పట్టుకుంటే వ్యాధి వ్యాప్తి చెందుతుంది. కళ్లల్లో చేతులు పెట్టుకోకుండా ఉంటే 90 శాతం ఈ వ్యాధి బారిన పడకుండా ఉండొచ్చు. వైద్యుల సూచనల మేరకు యాంటీబయాటిక్ ఐ డ్రాప్స్ వేసుకుంటే సరిపోతుంది. ప్రస్తుతం కళ్లకలక వ్యాధి చిన్నారుల్లో ఎక్కువగా ఉంది. పాఠశాలల్లో ఒకరి నుంచి మరొకరికి సులభంగా వ్యాపించే అవకాశం ఉంది. నిరంతరం వారు చేతులు శుభ్రం చేసుకునేలా చూడాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ చేతులు కంట్లో పెట్టుకోకుండా ఉండాలని సూచించాలి. పగలు ఎక్కువసార్లు ఐడ్రాప్స్ వేసుకోవడంతో పాటు రాత్రి సమయాల్లో వేపకాయ చూట్‌గా పిలిచే డ్రాప్స్ వేసుకుంటే మంచిది. ఇంట్లో వారికి కళ్ల కలక ఉంటే వారు వినియోగించినవి మిగిలిన వారు వాడకూడదు.

డాక్టర్ లావణ్య,
పిహెచ్‌సి వైద్యాధికారి, చుక్కలూరు.

తపాలా ఉద్యోగుల నిరసన

కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న తపాలా ఉద్యోగులు

ప్రజాశక్తి-హిందూపురం

ఆల్ ఇండియా గ్రామీణ తపాలా సేవా ఉద్యోగులు గురువారం స్థానిక తపాలా కార్యాలయం వద్ద దేశవ్యాప్త నిరసనల్లో భాగంగా ధర్నా చేపట్టారు. వీరికి సిఐటియు నాయకులు రాము, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్‌లు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తపాలా సేవా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలన్నారు. 8గంటల పని పెన్షన్ సహా అన్ని ప్రయోజనాలను మంజూరు చేయాలన్నారు. సీనియర్ జీడీఎస్. ఉద్యోగులకు సర్వీస్ అదనపు ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలన్నారు. ఆర్థిక ఉన్నతి కల్పించాలని కోరారు. గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.5 లక్షలకు పెంచాలన్నారు. గ్రాట్యూటీ రూ.5లక్షలు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు అబ్దుల్ మున్నా, నరసింహులు, ప్రభాకర్, నాగరాజు, జనార్ధన్, శ్రీనివాసులు, రామాంజినేయులు, కొల్లప్ప, గంగాధర్, రామచంద్రరావు, రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే శంకరనారాయణకు జాతీయ పతాకం అందజేస్తున్న పోస్టల్ అధికారి

పోస్టాఫీసుల్లో జాతీయ జెండాలు

ప్రజాశక్తి-పెనుకొండ

పంద్రాగస్టు పురస్కరించుకొని "హర్ ఘర్ తిరంగా" కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలనే లక్ష్యంతో అన్ని తపాలా కార్యాలయాల్లో త్రివర్ణ పతాకాన్ని అందుబాటులో ఉంచామని హిందూపురం పోస్టల్ సూపరింటెండెంట్ హరిబాబు పేర్కొన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే శంకరనారాయణ క్యాంప్ కార్యాలయంలో గురువారం ప్రప్రథమంగా జాతీయ జెండాను అందజేశారు. కార్యక్రమంలో పెనుకొండ సబ్ డివిజినల్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ విమల్‌కుమార్, సబ్ పోస్ట్‌మాస్టర్ సేవానాయక్, తదితరులు పాల్గొన్నారు. జాతీయ జెండాను రూ. 25కు విక్రయిస్తున్నామని కావాల్సిన వారు సమీప పోస్టాఫీసులో కొనుగోలు చేయవచ్చని పోస్టల్ అధికారులు తెలిపారు.

టిడిపిలో 50 కుటుంబాలు చేరిక

మడకశిర : అమరాపురం మండల పరిధిలోని హేమావతి పంచాయతీ గొల్లమారనపల్లి గ్రామంలో వైసిపికి చెందిన పాండు రంగప్ప ఆధ్వర్యంలో 50 కుటుంబాలు గురువారం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గుండుమల తిప్పేస్వామి సమక్షంలో పార్టీలోకి చేరగా వారికి పసుపు కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నరసింహమూర్తి, మండల కన్వీనర్ గణేష్, ఎంపిటిసి ఓంకారస్వామి, శివరుద్రప్ప, కృష్ణమూర్తి, జిల్లా వాల్మీకి సాధికారిక సమితి ఉపాధ్యక్షుడు మంజునాథ్, కుమారస్వామి, జయకుమార్, చెన్నప్ప, రఘు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



టిడిపిలో చేరిన వారికి కండువా వేసి ఆహ్వానిస్తున్న గుండుమల తిప్పేస్వామి

పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకూ పోరాటం

◆ ముఖ్యమంత్రి హామీని నిలబెట్టుకోవాలి ◆ సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్

రిలేదీక్షల్లో పేదలతో కలిసి కూర్చొన్న సిపిఎం, వ్యకాసం నాయకులు

రిలేదీక్షల్లో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్

ప్రజాశక్తి -పెనుకొండ

పెనుకొండలో నిరుపేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇచ్చేంత వరకు ఆందోళన విరమించే ప్రశక్తే లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ స్పష్టం చేశారు. పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రిలేనిరాహార దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇంతియాజ్ మాట్లాడుతూ పెనుకొండ నగర పంచాయతీ పరిధిలో సొంత ఇళ్లు లేని పేదలు వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు, సిపిఎం ఆధ్వర్యంలో భూస్వాధీనం పోరాటం చేశారన్నారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని అందులో పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారని తెలిపారు. అధికారులు పేదల సమస్యలను పట్టించుకోకుండా వారు వేసుకున్న గుడిసెలను తొలగించడం దుర్మార్గమైన చర్య అన్నారు. పేదలకు సొంత ఇళ్లు లేక, అద్దె ఇళ్లకు బాడుగలు కట్టలేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్ల స్థలాలు ఇవ్వాలని పేదలు తహశీల్దార్, కమిషనర్, సబ్ కలెక్టర్, కలెక్టర్, సచివాలయాల్లో పలుమార్లు అర్జీలు ఇచ్చారన్నారు. అయినా అధికారుల నుంచి ఎలాంటి స్పందనా లేదన్నారు. అర్జీలు పెట్టుకున్న 90 రోజుల్లోపు ఇళ్ల పట్టాలు ఇస్తామన్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి హామీ ఏమైందని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పేదలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించేంత వరకు ఆందోళనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి నవరత్నాల్లో భాగంగా పేదలకు ఇళ్లు కట్టించి ఇస్తామన్న హామీ అమలుకు నోచుకోలేదన్నారు. పెనుకొండలో పేదలు ఇళ్ల స్థలాల కోసం ఎమ్మెల్యే శంకరనారాయణను కలిసి విన్నవించినా ఫలితం లేదన్నారు. రెవెన్యూ అధికారులు కూడా నిర్లక్ష్యంగా వహిస్తున్నారని చెప్పారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న మాట్లాడుతూ పేదలకు న్యాయం జరిగేంతవరకు పోరాడుతామన్నారు. అధికారులు స్పందించకుంటే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఫిరంగి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ సొంత ఇళ్లు లేని పేదలు ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకుంటే వాటిని తొలగించడం అన్యాయమన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యకాసం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్ జిల్లా కమిటీ సభ్యులు వెంకటరాముడు, నారాయణ, తిప్పన్న, సదాశివ పేదలు పాల్గొన్నారు.

హిందూపురాన్ని అభివృద్ధి చేస్తాం :దీపిక

భూమి పూజ చేసి పనులను ప్రారంభిస్తున్న దీపిక

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంతో పాటు, నియోజక వర్గ వ్యాప్తంగా వార్డులు, అన్ని గ్రామాలను అభివృద్ధి చేస్తామని వైసిపి సమన్వయ కర్త, ఇన్‌ఛార్జి దీపిక తెలిపారు. గురువారం నాడు పురపాలక సంఘంలోని 10వ వార్డులో రూ.33లక్షలతో నూతనంగా చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణ పనులను భూమిపూజా చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా గడప గడపకు మన ప్రభుత్వం కింద వస్తున్న నిధులతో పాటు మంత్రి పెది రెడ్డి రామచంద్రా రెడ్డి సహకారంతో ప్రత్యేక నిధులను తీసుకొచ్చి అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్లు జబీవుల్లా, బలరామి రెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘని, కౌన్సిలర్లు పార్వతి నాగరాజు, మహేష్ గౌడ్, షాజియా, శివ, ఆసిఫ్, నాగేంద్రమ్మ, నాగేంద్రబాబు, గుడ్డం దాదు, చంద్ర, సునీత వెంకటేష్ రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి కోటిపి హనుమంత్ రెడ్డి, నాయకులు ఆర్కే కలీల్, రాంమూర్తి, చాంద్‌బాషా, కవిత, నరసింహ పాల్గొన్నారు.

మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసులును అభినందిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

పెనుకొండ మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా శ్రీనివాసులు

ప్రజాశక్తి -పెనుకొండ

రొద్దం మండల పరిధిలోని కలిపి మరవపల్లి గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు దేవాంగం శ్రీనివాసులుని పెనుకొండ వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్‌గా నియమించారు. దీంతో గురువారం ఆయన పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే శంకర నారాయణని మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ నియోజకవర్గంలో వైసిపి బలోపేతానికి, పెనుకొండ మార్కెట్ యార్డ్ అభివృద్ధికి పాటు పడతానని తెలిపారు. అనంతరం రొద్దం మండల వైసిపి నాయకులు శ్రీనివాసులుని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి చంద్రశేఖర్, స్వచ్ఛాంధ్ర స్టేట్ డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, జిల్లా సాంస్కృతిక చైర్మన్ జెట్టి మారుతిరెడ్డి, రాజారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బిసి అంటే బ్యాక్ బోన్ అని నినదిద్దాం

ప్రజాశక్తి-మడకశిర

బిసి అంటే బ్యాక్‌వర్డ్ క్యాస్ట్ కాదు బ్యాక్ బోన్ క్లాస్ అని నినదిద్దాం.. బిసిలకు రాజకీయ, ఆర్థిక, సామాజిక అండ టిడిపి జెండా అని బిసి సాధికారిక దాసరి రాష్ట్ర కన్వీనర్ తుపాకుల అప్పారావు తెలిపారు. టిడిపి అధికారంలోకి వస్తే చేపట్టే పథకాలను గురువారం నియోజకవర్గ వ్యాప్తంగా దాసరి కులస్తులకు వివరించే ప్రచార కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ దాసరి కులస్తులను ఎస్సీ, ఎస్టీ జాబితాలో చేర్చే అంశం, టిటిడి బోర్డులో సభ్యత్వం, తిరుపతిలో దాసరి మఠం ఏర్పాటు, దేవస్థానంలో ట్రస్ట్ బోర్డు మెంబర్‌గా అవకాశం, రాష్ట్రంలోని ప్రతి దేవస్థానం వద్ద షాపుల కేటాయింపు, రాజకీయ ప్రాధాన్యం, 50 ఏళ్లు దాటిన హరిదాసులకు పింఛన్ తదితర అంశాలపై ఇప్పటికే చంద్రబాబుతో చర్చించామని, అధికారంలోకి వస్తే ఇవన్నీ నెరవేరుస్తామని వివరించారు. కార్యక్రమంలో దాసరి సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ బసవనపల్లి రవి, తాలూకా అధ్యక్షుడు కాంతరాజు, మంజునాథ్, తదితరులు పాల్గొన్నారు.

సాధికార సమితి కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

రేపు ఫ్యాప్టో ఆధ్వర్యంలో నిరసన

మడకశిర : ఈ నెల 12వ తేదీ కలెక్టరేట్ వద్ద ఫ్యాప్టో ఆధ్వర్యంలో చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసులు, జనరల్ సెక్రటరీ జి.రామకృష్ణ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం పాపసానిపల్లి జడ్పి హైస్కూల్‌లో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు పెండింగ్ వేతనాలు, పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ, జిఒ-117 రద్దు, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ బదిలీ, తదితర డిమాండ్లతో నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా జిఒ-117తో విద్యావ్యవస్థ సంక్షోభంలో పడుతుందని సం ఘాలు, ఉపాధ్యాయు లు చెప్పినా ప్రభుత్వం చెవికెక్కించుకోలేదని మండిపడ్డారు. ఉపాధ్యాయులపై కక్ష సాధిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఆగస్టు 12న పుట్టపర్తి కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న 12 గంటల సామూహిక నిరసన కార్యక్రయంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఘనంగా 'పరమాణు జ్యోతి'

ప్రజాశక్తి-లేపాక్షి

స్థానిక జవహర్ నవోదయ విద్యాలయ ప్రాంగణంలో గురువారం పరమాణు జ్యోతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా డా. షియో ముకుంద్, అతిథిగా స్మితదఫోతి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించా రు. ఈ సందర్భంగా అతిథులు విజ్ఞాన శాస్త్రంలోని కొత్త పోకడలు వాటి ప్రాముఖ్యను గుర్తుచేశారు. పరమాణు జ్యోతి కార్యక్ర మం ప్రయోజనాన్ని విరించారు. ప్రిన్సిపల్ వందన సమర్పణతో సభ ముగిసింది. అలాగే వారు 9 నుంచి 12వ తరగతి విద్యార్థులతో ముఖాముఖి, చర్చా గోష్టి కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థుల ప్రశ్నలకు వారు చక్కటి పరిష్కారాలు చూపడంతో పాటు అనేక సందేహాలకు తెరదించారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరమాణు జ్యోతి కార్యక్రమంలో పాల్గొన్న విజ్ఞానశాస్త్రవేత్తలు

సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌కి చేయూత

రొద్దం : మండల పరిధిలోని కోగిర సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న పవిత్ర నాలుగు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడింది. ఆ తర్వాత అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొంది స్వగ్రామం చేరుకొని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటోంది. విషయం తెలుసుకున్న మండలంలోని 15 సచివాలయాల సిబ్బంది రూ. 25 వేలు సేకరించారు. ఆ మొత్తాన్ని గురువారం తురకలాపట్నం సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ పవన్ ద్వారా ఆమె కుటుంబానికి అందజేశారు. మండలంలో సచివాలయ సిబ్బందిని ఎలాంటి ఆపద వచ్చినా రొద్దం జెఎసి తరపున అండగా ఉంటామని జెఎసి ప్రెసిడెంట్ ముత్యాలనాయుడు తెలిపారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

రొద్దం : మండలంలో ఉన్న ఎరువుల దుకాణాల్లో గురువారం ధర్మవరం వ్యవసాయ సహాయ సంచాలకులు కృష్ణయ్య తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా నరసింహారెడ్డి ట్రేడర్స్, ఓం శ్రీసాయి ట్రేడర్స్, తిరుమల ఫర్టిలైజర్స్ దుకాణాల్లో ఎరువుల నిల్వలు, రికార్డులను తనిఖీ చేసినట్లు ఎఒ నివేదిత తెలిపారు. ఎరువులు అధిక ధరకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని దుకాణదారులను హెచ్చరించారు. వారితో పాటు వ్యవసాయ విస్తరణ అధికారి అంజాద్, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్న ఎడిఎ కృష్ణయ్య, ఎఒ నివేదిత

పేదలను సంపన్నులు చేయడమే టిడిపి ధ్యేయం

ప్రజాశక్తి-రొద్దం

పేదలను సంపన్నులు చేయడమే చంద్రబాబు ధ్యేయమని జిల్లా అధ్యక్షులు బికె పార్థసారథి పేర్కొన్నారు. పార్థసారథి ఆధ్వర్యంలో గురువారం మండల పరిధిలోని చెరుకూరు గ్రామంలో మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా బికె సతీమణి కమలమ్మ, జిల్లా మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, నియోజకవర్గం అధ్యక్షురాలు అనసూయమ్మ, ఉపాధ్యక్షు రాలు లీలావతి, టిడిపి రాష్ట్ర అంగన్వాడీ ఉపాధ్యక్షురాలు నాగమణి, ప్రధాన కార్యదర్శి అనురాధ, నియోజకవర్గ కార్యదర్శి తులసి ఇంటింటికీ వెళ్లి భవిష్యత్తుకి గ్యారెంటీ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ మహిళా సాధికారతే ధ్యేయంగా చంద్రబాబు కృషి చేస్తున్నారని వివరించారు. అంతకుముందు మహాశక్తి ప్రతినిధులను గ్రామ మహిళ లు సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి రొద్దం నరసింహులు, నియోజకవర్గ కమిటీ అధ్యక్షులు చిన్నప్పయ్య, కన్వీనర్ నరహరి, చంద్రశేఖర్‌నాయుడు, అంజప్ప, కిష్టప్ప, రొద్దం చంద్ర, గంగప్ప, చౌడప్ప, హనుమప్ప, గంగాధ రప్ప, కెటి తిప్పన్న, చంద్రప్ప, మురళి, నరసింహులు, రాజప్ప, సానిపల్లి వెంకటేష్, శంకర్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మడకశిర రూరల్ : మండల పరిధిలోని మెలవాయి గ్రామంలో గురువారం టిడిపి ఆధ్వర్యంలో మహాశక్తి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా నియోజకవర్గ మహిళా కార్యదర్శి ప్రమీలమ్మ, రోజా, నరసమ్మ, సునంద మ్మ, లలితమ్మ, అంబికా, లీలావతి, కళావతి, కెంపమ్మ, కోమలమ్మ ఇంటింటికీ వెళ్లి మహిళలకు కరపత్రాలు పంపిణి చేశారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ టిడిపి మేనిఫెస్టోలో పేదల ఆర్థికాభివృద్ధి, సంక్షేమ పథకాలకు పెద్దపీట వేశారన్నారు. కావున రాబోయే ఎన్నికల్లో టిడిపి ఆదరించాలని కోరారు. చంద్రబాబుతోనే రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సుబ్బారెడ్డి, సోమశేఖర్, మల్లికార్జున, ఆనంద్, సంతోష్, నరసింహారెడ్డి, ముద్దరంగప్ప, నాగరాజు, నర్సేగౌడ్, ఆంజనేయులు, తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.

చెరుకూరులో 'మహాశక్తి' కరపత్రాలను పంపిణీ చేస్తున్న బికె పార్థసారథి, నాయకులు

ప్రజాశక్తి
www.prajasakti.com

పంచాయతీల్లోనే ఆదాయవనరులు సమకూర్చుకోవాలి

కమిషనర్‌కి వినతిత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి చిలమత్తూరు

విద్యుత్ శాఖకు చెల్లించల్సిన బిల్లుల నుండి స్వచ్ఛభారత్ కార్మికుల వేతనాల చెల్లింపు వరుకు అన్నింటికి ప్రభుత్వాల నుండి వచ్చే నిధుల నుండే వెచ్చించాలన్న ఆలోచన సరికాదని పంచాయతీ రాజ్ కమిషనర్ సూర్యకుమారి అన్నారు. ఈ మేరకు చిలమత్తూరు మండలం కోడూరులో గ్రామ పంచాయతీలలో నూతనంగా చేపట్టిన నగదు రహిత లావాదేవీల కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామ పంచాయతీ పన్నుల మొదలు, అన్ని రకాల చెల్లింపులను డిజిటల్ రూపం లోనే చేపట్టడం జరుగుతుందని అన్నారు. హెచ్ డీ ఎఫ్ సి బ్యాంక్ సౌజన్యంతో ప్రభుత్వం ఈ విధానాన్ని తీసుకొచ్చిందనిదీనిని ప్రభుత్వం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

స్వచ్ఛ భారత్ కార్మికులకు వేతనాలు చెల్లించండి : స్వచ్ఛ భారత్ కార్మికులకు పెండింగ్ లో ఉన్న 18 నెలల వేతనాలు చెల్లించాలని పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నాయకులు కోరారు. ఈ మేరకు సిఐటియు ఆధ్వర్యంలో పంచాయతీ రాజ్ కమిషనర్ సూర్యకుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటీయు నాయకులు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ 18 నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో స్వచ్ఛ భారత్ కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అలాగే పారిశుధ్య కార్మికులకు ఇఎస్ఐ, పిఎఫ్‌లను అమలు చేయాలని డిమాండ్ చేశారు. వినతీ పత్రాన్ని స్వీకరించిన కమిషనర్ సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం కమిషనర్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కోడూరు, చిలమత్తూరు మేజర్ పంచాయతీలు అని వీటికి ఆర్థిక సంఘం నిధులతో పాటు, జనరల్ ఫండ్ కూడా వస్తుందని అన్నారు. వాటిని ఉపయోగించి వేతనాలు ఇవ్వల్సింది పోయి పై నుండి రావాలని కూర్చుంటే అవుతుందా? అని ప్రశ్నించారు. ప్రసిద్ధి కెక్కిన మర్రో తోపు ప్రదేశంలో మంచి పార్క్ ఏర్పాటు చేసి సంపద సృష్టించుకోవచ్చని అన్నారు. స్వయంగా ఆర్థిక వనరులు సమకూర్చడంలో పంచాయతీలు కృషి చేయాలని అన్నారు.

విద్యార్థులకు కమిటీ ఎన్నికలు

కొత్తచెరువు : కొత్తచెరువు లోనిశ్రీ చైతన్య పాఠశాలలో గురువారం విద్యార్థుల కమిటీలకు ఎన్నికలు నిర్వహించినట్టు ప్రిన్సిపల్ నవీన్ కుమార్ రెడ్డి తెలిపారు సంవత్సరానికి ఒకసారి విద్యార్థులకు ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందన్నారు ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును విద్యార్థులు ఎలా వేయాలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీన్ హనుమంతుచ ఎఒ కేశవరెడ్డి, పిఇటిలు నరేంద్ర. కవిత తదితరులు పాల్గొన్నారు.

అవినీతి పాలనకు చరమగీతం

కొత్తచెరువు : రాష్ట్రంలో కొనసాగుతున్న వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలని శ్రీ సత్యసాయి జిల్లా టిడిపి అధికార ప్రతినిధి ఎస్ శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ అన్నారు. మండల పరిధిలోని కోడపగానిపల్లి వేములేటిపల్లి గ్రామాల్లో గురువారం ఇంటింటా తిరిగి మినీ మేనిఫెస్టో లోనే పథకాల గురించి వివరించే కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రామకృష్ణ, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాస్, టిడిపి నాయకులు రిటైర్డ్ టీచర్ నాగేందర్ ప్రసాద్, సుధాకర, సురేష్, బోయరాజు, శివ, శ్రీరాములు, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు,

చంద్రబాబుపై కేసులు దారుణం

ముదిగుబ్బ : చంద్రబాబు నాయుడు పై కేసులు మోపడం దారుణమని ముదిగుబ్బ మండల క్లస్టర్ ఇంచార్జ్ తుమ్మల మనోహర్ పేర్కొన్నారు, ఈ సందర్భంగా గురువారంమండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబునాయుడు, ఇతర తెలుగుదేశం పార్టీ నాయకులపై హత్యాయత్నం కేసులు పెట్టడం దారుణమని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ప్రజాక్షేత్రంలో ఇలాగే ప్రవర్తిస్తే రాబోయే ఎన్నికలలో ప్రజలే తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ నాయకులు గడ్డం మోహన్, అనీఫ్, రషీద్, వెంకటరమణ, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

దేశ నాయకుల చిత్రపటాలు వితరణ

పుట్టపర్తి రూరల్: మండల పరిధిలోని నిడిమామిడి ఉన్నత పాఠశాలకు దేశ నాయకుల చిత్రపటాలను రిటైర్డ్ ఉపాధ్యాయులు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వెంకటరత్నం అందజేశారు. ఆయన గురువారం పాఠశాలలోని ప్రధానోపాధ్యాయులు నాగపద్మకు దేశ నాయకుల చిత్రపటాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ ప్రసాద్ మాట్లాడుతూ శ్రీ సత్య సాయి బాబా స్ఫూర్తితో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పి శంకరప్ప, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన

కొత్తచెరువు రూరల్: పర్యావరణాన్ని పరిరక్షించడం విద్యార్థుల బాధ్యత అని పర్యావరణ వేత్త డాక్టర్ భాస్కర్ నాయుడు పేర్కొన్నారు.ఈ మేరకు ఆయన గురువారం మండలంలోని బండ్లపల్లి, నారాయణపురం పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు ఎలా మెలగాలో వివరించారు. పర్యావరణ పరిరక్షణ వాటి ఆవశ్యకత గురించి అవగాహన కల్పించారు.ఉమ్మడి అనంతపురంజిల్లాలో ముఖ్యమైన వాల్టా చట్టం అమలులో ఉందన్నారు. చిప్కో ఉద్యమం ద్వారా చెట్లను ఎలా రక్షించాలి, అడవులను కాలిపోకుండా ఎలా కాపాడుకోవాలి, వాటి యొక్క విశిష్టత ఏమిటి అన్న దానిపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పండ్ల మొక్కలు పంపిణీ

కదిరి టౌన్ : కదిరి రెడ్స్, సేర్టీ సంస్థ వారి సహ కారంతో కదిరి మండలంలోని 19 మంది రైతులకు 4000 వేల పండ్ల మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు.కదిరి హార్టికల్చర్ అధికారి ప్రతాప్ రెడ్డి, సేర్టీ సంస్థ ఫీల్డ్ ఆఫీసర్ పీరావలి,రెడ్స్ డైరెక్టర్ భానుజా మాట్లాడుతూ కదిరి ప్రాంతంలో పండ్ల మొక్కల సాగును ప్రోత్సహించేందుకు రైతులకు 7 రకాల పండ్ల మొక్కలను పంపిణి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్య క్రమంలో రెడ్స్ కోఆర్డినేటర్ ఎల్లప్ప, గంగులప్ప, మహిళా రైతు ఉత్పత్తి దారుల సంఘం లీడర్లు జయసుధ, గాయిత్రి, రైతులు పాల్గొన్నారు.

క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలి

హిందూపురం : దళితులు క్రైస్తవ మతాన్ని స్వీకరిస్తే ఎస్సీ హోదా కొనసాగించాలని ఆలిండియా క్రిస్టియన్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ కోరారు. గురువారం స్థానిక సిఅండ్ ఐజీ మిషన్ కాంపౌండ్ చర్చిలో భారత క్రైస్తవుల జాతీయ నిరసన దినాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా క్రైస్తవ సంఘాల నాయకులు మాట్లాడుతూ మతం మారినా, కులం మారిన వారి సామాజిక స్థితి మారదన్నారు. కావున అలాంటి వారిని ఎస్సీగానే పరగణించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లైఫ్ వరల్డ్ ఉదయకుమార్, ఏఐసీఎఫ్, స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ సూర్య ప్రకాష్, పాస్టర్ ఫెలోషిప్స్ ప్రెసిడెంట్ ఇజ్రాయిల్ రాజ్, పాల్ తిమోతి, దేవరాజ్, డేవిడ్, పాస్టర్ స్టీఫెన్రాజ్, విక్టర్ జాషువా, ఆనంద్, ఆంజనేయులు. డానియల్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాలిసెట్ ఆప్షన్ నమోదు

ప్రజాశక్తి-హిందూపురం

పాలిసెట్-2023 ఆప్షన్ నమోదు ప్రక్రియ ఆగస్టు 11 నుండి 14వ తేదీ వరకు జరగనున్నట్లు హిందూపురం మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఎన్.హరీష్ బాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు www.appolycet.nic.in వెబ్‌సైట్‌ను సందర్శించడం ద్వారా తమ ఆప్షన్ నమోదు ప్రక్రియను నమోదు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో ఆప్షన్లను 16వ తేదీ వరకు మార్పు చేసుకునే అవకాశం ఉందన్నారు.

సమావేశంలో పాల్గొన్న నాయకులు

కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు

ప్రజాశక్తి - కదిరి టౌన్

మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్న డిమాండ్‌తో నెల 17న విజయవాడ కార్యక్రమం చేపడతామని సిఐటియు అనుబంధ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ తెలిపారు. గురువారం పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) పట్టణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, కోశాధికారి తిరుపాల్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కార్మికులందరూ ఐక్యంగా పోరాడాలన్నారు.కరోనా సమయంలో ముందుండి పనిచేసిన మున్సిపల్ కార్మికులను ఆదుకోకపోగా వేతనాలు కూడా సక్రమంగా చెల్లించలేదన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులను సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో ఈనెల 17వ తేదీన చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా జగన్మోహన్, అధ్యక్షులుగా జనార్దన్, కార్యదర్శిగా బాలకృష్ణ, కోశాధికారిగా సూరి, ఉపాధ్యక్షులుగా రామాంజనేయులు, రాజు, సుమతి, ఎమ్. రామాంజులు, సహాయ కార్యదర్శులుగా నరసింహమూర్తి, రాజేష్, చిన్నకృష్ణ, చంద్రప్పతో పాటు 9 మంది సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడి కుటుంబీకులకు సన్మానం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మండల పరిధిలోని పెడపల్లి ఉన్నత పాఠశాలలో గురువారం జరిగిన కార్యక్రమంలో స్వాతంత్ర్య సమరయోధుడి కుటుంబాన్ని పంచాయతీరాజ్ కమిషనర్ సూర్యకుమారి సన్మానించారు. పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమెకు పెడపల్లి ఉన్నత పాఠశాల లోసర్పంచ్ మంగ్లీ బాయ్, ఎంపిటిసి సరస్వతి బాయి ,స్వాగతం పలికారు. విద్యార్థుల, వైసిపి నాయకులు, అధికారులు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. తొలుత జాతీయ నాయకుల చిత్రపటాలకు నివాళులర్పించి, అనంతరం పంచ ప్రాణ ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని విద్యార్థులు అధికారులు తో కలిసి నిర్వహించారు. స్వతంత్రం వచ్చి 75 సంవత్సరాలు అయిన సందర్భంగా 75 మొక్కలను నాటే కార్యక్రమాన్ని ఆమె పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వతంత్ర సమరయోధులు మాజీ ఎమ్మెల్సీ ,మాజీ జెడ్పీ చైర్మన్, పెడపల్లి చిదంబర రెడ్డి కుటుంబ సభ్యులైన ప్రస్తుత ఎంపీపీ రమణారెడ్డిని వారి కుటుంబ సభ్యులకు ఆమె సన్మానించారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ కార్తీక్, ఆర్డీవో భాగ్యరేఖ, సీఈవో భాస్కర్ రెడ్డి, డిడబ్ల్యూఎం పీడీ రామాంజనేయులు, డిపిఒ విజయ్ కుమార్, స్థానిక సర్పంచి మంగ్లీ బాయ్, జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు తిరుపాల్ నాయక్, సతీష్ రెడ్డి, ఎంపీటీసీ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ గా రవికుమార్

ప్రజాశక్తి - బుక్కపట్నం

ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన ప్రిన్సిపల్‌గా రవికుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న లక్ష్మయ్య గుంతకల్లుకు బదిలీ కాగా ఆయన స్థానంలో ఎఫ్ఎసి ప్రిన్సిపల్ గా రవికుమార్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలేజ్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. నూతన ప్రిన్సిపల్‌కు బోధన బోధనేతర సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి - కదిరి అర్బన్

ఖాద్రీశుడి ఆలయంలోని హుండిల లెక్కింపును గురువారం నిర్వహించారు. ఆలయ ఈవో శ్రీనివాసులురెడ్డి పాలకమండలి చైర్మన్ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 54 రోజులకు గాను రూ.63,79,076ల ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో హుండీ పర్యవేక్షణాధికారిగా నరసింహరాజు, తనిఖీ అధికారి, దేవాదాయ ధర్మాదాయ శాఖ, హిందూపురము డివిజన్, దేవస్థానము సిబ్బంది, స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా మేయిన్ బ్రాంచి మేనేజర్ ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కదిరి టౌన్

గడప గడపకు ప్రభుత్వంలో భాగంగా చేపట్టిన అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే సిద్దా రెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో వార్డు సచివాలయం ఎమినిటీ సెక్రటరీ, అడ్మిన్ లతోచ ప్రజా ప్రతినిధులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూకదిరి మున్సిపాలిటీ పరిధిలో 27 సచివాలయాల్లో నిర్వహించిన గడప గడపకు ప్రభుత్వంలో ప్రజలు లేవనెత్తిన సమస్యల పరిష్కారానికి ప్రతి సచివాలయం పరిధిలో రూ.20 లక్షల రూపాయలతో చేపట్టు అభివృద్ధి కార్యక్రమాలను త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ నజీమున్నీసా సాదిక్, వైస్ చైర్మన్లు, మున్సిపల్ కమిషనర్ శ్రీహరి బాబు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రత్యేక హోదా కోసం ట్రై సైకిల్ యాత్ర

ప్రజాశక్తి- చిలమత్తూరు

రాష్ట్ర విభజన హామీలు అమలు చేయాలని కోరుతూ శ్రీకాకుళం జిల్లా కంచలీ మండలం భోరగాం గ్రామానికి చెందిన ప్రసాద్ అనే వికలాంగుడు చేపట్టిన ట్రై సైకిల్‌యాత్ర గురువారం చిలమత్తూరు మండలానికి చేరుకుంది. ప్రసాద్ 13 జిల్లాలను తిరుగుతూ శ్రీ సత్యసాయి జిల్లా చిలమత్తూరు తహశీల్దార్ కార్యాలయానికి గురువారం చేరుకున్నారు. జిల్లాలోని అన్ని తహశీల్దార్ కార్యాలయాలకు వెళ్లి వినతులు అందజేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఆంధ్రప్రదేశ్ కు ప్రత్యేక హోదా ఇవ్వాలని, విశాఖపట్నం కు రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని డిమాండ్లతో ట్రై సైకిల్ యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి తహశీల్దార్ కార్యాలయం, ఎస్పీ, సబ్ కలెక్టర్, జిల్లా కలెక్టర్‌ను కలుస్తున్నానని చెప్పారు. వీటన్నింటిని తీసుకొని ఢిలీకి వెళ్లి అక్కడ ప్రధానమంత్రికి అందజేయనున్నట్లు ఆయన తెలిపారు.

సైకిల్‌యాత్రలో ప్రసాద్

సచివాలయ ఉద్యోగితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ప్రజలకు అందుబాటులో ఉండాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గాండ్లపెంట

సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ పివి. సిద్ధారెడ్డి ఆదేశించారు. మండల పరిధిలోని సోమయాజులపల్లి సచివాలయాన్ని ఆయన గురువారం తనిఖీ నిర్వహించారు. సచివాలయ సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ఉదయం 10 గంటల పది నిమిషాలకు డిజిటల్ అసిస్టెంట్, హెల్త్ అసిస్టెంట్ హాజరయ్యారు. వెల్ఫేర్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి, అగ్రికల్చర్ అసిస్టెంట్ సెలవుల్లో వెళ్లారని, వీఆర్వో, సర్వే అసిస్టెంట్ ఫీల్డ్ కి వెళ్ళారని సిబ్బంది తెలిపారు. డిజిటల్ అసిస్టెంట్‌పై ఫిర్యాదులు వస్తున్నాయని ప్రజల సమస్యలు పరిష్కరించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి భాస్కర్ రెడ్డి, సర్పంచి హుస్సేన్ పీరా, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

చలివెందుల ఉపపోరులో ఏడుగురు

ఇన్‌ఛార్జి దీపికతో కలసి నామినేషన్ వేస్తున్న ఉపేంద్రరెడ్డి

టిడిపి నాయకులతో కలసి నామినేషన్ వేస్తున్న రవీంద్రారెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం చలివెందుల గ్రామ పంచాయతీకి జరుగుతున్న సర్పంచి ఉప ఎన్నికల్లో నామినేషన్ ప్రక్రియ కొనసాగింది. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నాడు గట్టి బందోబస్తు మధ్య నామినేషన్ ప్రక్రియ సాగింది. నామినేషన్ కార్యక్రమంలో మొత్తం ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. వైసిపి బలపరుస్తున్న అభ్యర్థిగా బి.ఉపేంద్రరెడ్డి రెండు సెట్లు నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. టిడిపి తరుపున రవీంద్రారెడ్డి రెండు సెట్లు నామినేషన్లు దాఖలు చేశారు. గవిరెడ్డిగారి వెంకటరెడ్డితో పాటు వైసిపి తరపున రెబల్ అభ్యర్థిగా మహేంద్రరెడ్డి నామినేషన్లు దాఖలు చేయగా మొత్తం ఏడు నామినేషన్లు దాఖలైయ్యాయి. ఈ సందర్భంగా టిడిపి నాయకులు ఎలాగైన ఉప ఎన్నికల్లో గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు. వైసిపి ఇన్‌ఛార్జి దీపిక సైతం అందరం కలిసి అత్యధిక మెజార్టీతో తమ అభ్యర్థిని గెలిపించచుకుంటామని ధీమాగా ఉన్నారు. వైసిపి తరపున రెబల్ అభ్యర్థిగా పోటీలో ఉన్న మహేంద్ర రెడ్డి గత ఎన్నికల్లో బరిలో ఉంటే పార్టీ పెద్దల సూచనల మేరకు బరిలో నుంచి తప్పుకున్నాన్నారు. ఈ సారి తనకు అవకాశం కల్పించాలని కోరారు. వైసిపి అభ్యర్థి తరపున నామినేషన్ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ గని, జడ్పిటిసిలు నాగభూషణప్ప,

అధికార పార్టీకి తప్పని రెబల్ బెడద

బాణాల శ్రీనివాస్ రెడ్డి, వైసిపి నాయకురాలు చౌలూరు మధుమతి రెడ్డి, ఎంపీపీ రత్నమ్మ, వైస్ ఎంపిపి రామంజి, రఘునాథ్ రెడ్డి, ఎంపీటీసీలు ధనుంజయ రెడ్డి, కృష్ణవేణి, నాగరాజు, కవితా, మంజునాథ్, జగన్నాథ్ రెడ్డి, కౌన్సిలర్ షాజియా, శివ, ఆసిఫ్, పార్వతీ నాగరాజు, గిరి, రామచంద్ర, నాగేంద్రబాబు, మల్లికార్జున, నాగేంద్రమ్మ , మల్లికార్జున గౌడ్, చంద్ర, గుడ్డం దాదు, సర్పంచులు ఆనంద్, నంజప్ప, దేవరాజు, లలితా రాము, జయలక్ష్మి , భాగ్యమ్మ మూర్తి, శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి కోటిపి హనుమంత్ రెడ్డి, కొల్లకుంట ఆనంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు. టిడిపి తరపున ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్ర, నియోజక వర్గ సమన్వయ కర్త శ్రీనివాస రావు, కన్వీనర్ అశ్వర్థ రెడ్డి, నాయకులు నాగరాజు, అనిల్ కుమార్, రాష్ట్ర కార్యదర్శి కొల్లకుంట అంజనప్ప, పట్టణ అధ్యక్షుడు డి.ఈ రమేష్ కుమార్, రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి బెవనహల్లి ఆనంద్, కార్యదర్శి అమర్నాథ్, పార్లమెంటు కార్యదర్శి ఆదినారాయణ, లీగల్ సెల్ పార్లమెంట్ అధ్యక్షులు శివశంకర్, మాజీ సర్పంచులు చిన్నారెడ్డి, రాము, హనుమంత, సర్పంచు మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి వృద్ధుడు మృతి

కొత్తచెరువు : బుక్కపట్నం మండల కేంద్రానికి చెందిన వృద్ధుడు కొత్తచెరువు రైల్వే స్టేషన్ సమీపంలో రైలు కింద పడి మృతిచెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు... బుక్కపట్నంలోనిఈడిగ వీధిలో నివాసముంటున్న ధర్మీ శెట్టి శ్రీరాములు భార్య ఇటీవల మృతిచెందింది. ఆమె మరణాన్ని జీర్ణించుకోలేని శ్రీరాములు ఆర్థిక ఇబ్బందులు తాళలేక మనస్తాపంతో రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు

కారు బోల్తా ....

చిలమత్తూరు : మండల పరిధిలోని శిరా జాతీయరహదారి వడ్డిచన్నంపల్లి సమీపంలో గురువారం కారు అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కారు నుజ్జు నుజ్జు అయింది. హిందూపురం నుండి కొడికొండ చెక్‌పోస్టు వైపు వెళుతున్న ఈ కారులో ఉన్న మారగాణ కుంట్ల గ్రామానికి చెందిన మనోజ్ కుమార్ ఎలాంటి గాయాలు లేకుండా బయటపడ్డాడు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

లేపాక్షి : మండల పరిధిలోని కంచిసముద్రం గ్రామ శివారులో గురువారం కారు ఢీకొనడంతో నాయనిపల్లి పంచాయ తీ ఉప్పరపల్లి గ్రామానికి చెందిన వెంకటేశప్ప(65) మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. వెంకటేశప్పకు భార్య రత్నమ్మ, కూతురు ఉండేది. కూతురిని కర్నాటకకు చెందిన వ్యక్తికి ఇచ్చి వివాహం చేశాడు. కూతురిని చూడటానికి వెళ్తుండగా మార్గమధ్యలో ప్రమాదం జరగడంతో స్థానికులు నాగిరిగేరి ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం గౌరీబిదునూరుకు తరలిస్తుండగా మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ప్రమాదంపై నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడు ఆత్మహత్య

లేపాక్షి : మండల పరిధిలోని పులిమీద పంచాయతీలోని తిలక్‌నగర్‌కు చెందిన బర్కతుల్లా(25) గురువారం ఇంటి వద్ద ఓ చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అతడు తల్లిపై ఆధారపడి జీవితం సాగిస్తుండేవాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఉదయం ఇంటి వెనుక ఉన్న ఓ చెట్టుకు చీరతో ఉరి వేసుకొన్నాడు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని హిందూపురం ఆసుపత్రికి తరలించారు. అలాగే కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళా పోలీసులు అప్రమత్తంగా ఉండాలి

ధర్మవరం టౌన్ : గ్రామీణ ప్రాంతాలలో గల మహిళా పోలీసులు అప్రమత్తంగా ఉండాలని దిశా డిఎస్‌పి కెవిఎన్. వరప్రసాద్ తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో గ్రామ మహిళ పోలీసులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల నేపథ్యంలో ఫ్యాక్షన్ గ్రామాల్లో ఇప్పటినుంచి అప్రమత్తంగా ఉండడంతో పాటు, చట్ట వ్యతిరేక కార్యకలాకాలపై నిఘా ఉంచాలన్నారు. ఎప్పటికప్పుడు సమాచారాన్ని సీఐకు గాని, ఎస్ఐకు గాని సమాచారం అందించాలన్నారు. అంతేకాకుండా దిశా యాప్ పై పట్టణ గ్రామీణ ప్రాంతాలలో మహిళలకు, యువతులకు, బాలికలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మెగా జాబ్‌మేళా

పుట్టపర్తి అర్బన్ : బుక్కపట్నం డిగ్రీ కళాశాలలో శుక్రవారం మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్య శాఖ అభివద్ధి అధికారి అబ్దుల్ ఖయ్యాం, జాబ్ కోఆర్డినేటర్ ఆంజనేయులు తెలిపారు. ఈ మేరకు వారు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 12 కంపెనీల ప్రతినిధులు మెగా జాబ్ మేళాలో పాల్గొంటారన్నారు. పదవ తరగతి, ఇంటర్, డిప్లమా, ఐటిఐ, డిగ్రీ పూర్తి చేసిన 18 నుంచి 35 సంవత్సరాల లోపు వయసు ఉన్నవారు జాబ్‌మేళాకు అర్హులన్నారు. నెలకు వేతనం రూ. 10వేల నుంచి 30 వేల రూపాయల వరకు వేతనం ఉంటుందన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు పెనుకొండ, బెంగళూరు, చిత్తూరు, శ్రీ సత్య సాయి, అనంతపురం జిల్లాలలో ఉద్యోగం చేయాల్సి ఉంటుందన్నారు. ఆసక్తి గల యువతీ యువకులు శుక్రవారం శ్రీ సత్యసాయి డిగ్రీ కళాశాలలో జరిగే ఇంటర్వ్యూకు బయోడేటా తో పాటు ఆధార్ కార్డ్, అర్హత పత్రాలు తీసుకుని ఉదయం 9 గంటలకు హాజరుకావాలని కోరారు.

జిల్లా, దక్షిణ మండల క్రికెట్ జట్లకు కదిరి క్రీడాకారులు

కదిరి టౌన్ : ఆంధ్ర క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లా వెంకట గిరి లో జరుగుతున్న అండర్-16 అంతర జిల్లాల బాలుర క్రికెట్, మంగళగిరి నందు జరుగుతున్న అండర్ 19 మహిళా అంతర మండల క్రికెట్ పోటీలకు కదిరి ఆర్డీటీ, జిల్లా క్రికెట్ సంఘం కోచింగ్ క్రీడాకారులు తరుణ్ కుమార్, నిశ్చయ్, అర్షియా లు ఎంపికైనట్లు కోచ్ నజీర్ తెలిపారు. వీరు ఈ పోటీలలో రాణించి మరింత పై స్థాయి పోటీలకు ఎంపిక అవ్వాలని ఆర్డీటీ సిబ్బంది, కదిరి క్రికెట్ సంఘం సభ్యులు, పాఠశాల సిబ్బంది, సీనియర్ క్రీడాకారులు ఆకాంక్షించారు.

డైట్ సెట్ వెబ్ కౌన్సిలింగ్‌కు అవకాశం

బుక్కపట్నం : ఇంటర్మీడియట్ 40శాతం మార్కులతో పాస్ అయిన విద్యార్థిని విద్యార్థులకు సత్య సాయి జిల్లా ప్రభుత్వ జిల్లా శిక్షణ కేంద్రంలో రెండవ కౌన్సిలింగ్ వెబ్ ఆప్షన్లకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని జిల్లా శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ రామకృష్ణ తెలిపారు నేటి నుంచి 13వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లను నమోదు చేసుకోవాలని సీట్ అలాట్మెంట్ 14వ తేదీ నుంచి 16 వరకు ఉంటుందని చెప్పారు. 17వ తేదీ నుంచి 20 వరకు జిల్లా శిక్షణ కేంద్రంలో కౌన్సిలింగ్ నిర్వహిస్తారని తెలిపారు. అదేవిధంగా తెలుగు మీడియంలో ఎగ్జామ్ రాసిన అభ్యర్థులకు ఇంగ్లీష్ మీడియం లోకి మార్చుకునే అవకాశం కల్పించినట్లు చెప్పారు.

13న రజక సంఘం జిల్లా మహాసభ

పుట్టపర్తి క్రైమ్ : రజక సంఘం ప్రథమ జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బాపనపల్లి శివప్ప పిలుపునిచ్చారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని ఎనుములపల్లిలో ఆ సంఘం నాయకులు మహాసభ కరపత్రాలను స్థానిక సత్యసాయి కళ్యాణ మండపంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే జిల్లాలోని రజకులను ఆయా గ్రామాల్లో కలిసి మహాసభ గురించి తెలిపామన్నారు. ముఖ్యంగా ఆ మహాసభలో రజకులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి ఉద్యమ కార్యచరణ రూపొందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి తెలిక ఆంజనేయులు, జిల్లా కో కన్వీనర్ బి. నాగరాజు, నాయకులు నారాయణప్ప, ఎనుములపల్లి రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

క్షతగాత్రుడిని పరామర్శించిన ఎమ్మెల్యే

తలుపుల : మండలంలోని లక్కసముద్రం సర్పంచి కుమారుడు సుదర్శన్ రెడ్డి ద్విచక్రవాహనం ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న కదిరి శాసనసభ్యులు డాక్టర్ పి వి సిద్దా రెడ్డి గురువారం క్షతగాత్రుడిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

బత్తల అక్షయ్‌కు పలువురి శుభాకాంక్షలు

కదిరి టౌన్ : వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ బత్తల హరి ప్రసాద్ తనయుడు అక్షయ్ జన్మదినోత్సవం వేడులకు గురువారం ఘనంగా నిర్వహించారు. కదిరి రూరల్‌లోని కుమ్మర వాండ్లపల్లి లోని ఆయన నివాసం వద్ద వారి కుటుంబ సభ్యులు, వైసిపి శ్రేణుల సమక్షంలో బత్తల అక్షయ్ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. అలాగే వైఎస్సార్ మెమోరి యల్ క్రికెట్ టోర్నీ ఆడు తున్న క్రీడాకారులు, ప్రేక్షకుల సమక్షం లో బత్తల అక్షయ్ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు డాక్టర్ బత్తల వెంకట రమణ, మాజీ సర్పంచి బత్తల వెంకట రమణ, వైసిపి పట్టణ అధ్యక్షులు బాహుద్దీన్, వైస్ ఎంపీపీ బత్తల ఆదినారాయణ, సంపంగి గోవర్ధన్ బత్తల రామ్ ప్రసాద్, బత్తల శ్రావణ్, జాకీర్, జెరిపిటి జయరాజు తదితరులు పాల్గొన్నారు.



కేక్‌కట్ చేస్తున్న అభిమానులు, నాయకులు

బాదితుడికి కుట్టుమిషన్, పరికరాలను అందజేస్తున్న 10వ వార్డు టీడీపీ ఇన్‌ఛార్జి క్రిష్ణాపురం జమీర్ అహమ్మద్

కుట్టుమిషన్ పంపిణీ

ప్రజాశక్తి ధర్మవరం టౌన్

పట్టణంలోని మార్కెట్ వీధిలో రెండు రోజుల క్రితం నబీరసూలుకు చెందిన కుట్టుమిషన్ బంకుకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో కాలిపోయింది. దీంతో నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాలశ్రీరామ్ ఆదేశాలు మేరకు 10వ వార్డు టీడీపీ ఇన్‌ఛార్జి క్రిష్ణాపురంజమీర్ అహమ్మద్ కుట్టుమిషన్, పరికరాలను పంపిణీ చేశారు.

ఉప ఎన్నికకు నామినేషన్లు దాఖలు

గోరంట్ల, మడకశిర మండలాల్లో నామినేషన్లు దాఖలు చేస్తున్న అభ్యర్థులు

ప్రజాశక్తి-గోరంట్ల రూరల్

గోరంట్ల మేజర్ పంచాయతీ పరిధిలో ఖాళీ పడిన 18వ వార్డు మెంబర్ స్థానానికి గురువారం టిడిపి తరపున సింగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్ మండల పరిషత్ కార్యాలయంలో ఎన్నికల అధికారి సుధాకర్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ పులేరు సోమశేఖర్, దేవా, నరసింహా, అశ్వర్థరెడ్డి, ఉత్తమరెడ్డి, నరసింహప్ప, బాలకృష్ణ, రంగప్ప, తదితరులు పాల్గొన్నారు. జనసేన అభ్యర్థిగా గోవిందమ్మ నామినేషన్ దాఖలు చేశారు. కార్యక్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లా అధ్యక్షులు సురేష్, మండల అధ్యక్షులు సంతోష్, జిల్లా కార్యదర్శి సురేష్, జిల్లా సంయుక్త కార్యదర్శి వెంకటేష్, నరేష్, శ్రీనివాసులు, ప్రసాద్, విజయ్, తదితరులు పాల్గొన్నారు. వైసిపి తరపున సింగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గొల్ల నరసింహప్ప ఎన్నికల అధికారి సుధాకర్, ఎంపిడిఒ రఘునాథ్‌గుప్తా లకు నామినేషన్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో శివారెడ్డి, సర్పంచి సరోజానాగే నాయక్, ఎంపిపి ప్రమీలమూర్తి, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ పాటూరు శంకర్‌రెడ్డి, జిల్లా కో ఆప్షన్ సభ్యులు డాక్టర్‌బాషా, మండల కో ఆప్షన్ సభ్యులు జబ్బార్, మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, పట్టణ కన్వీనర్ ధనుంజయరెడ్డి, మేదర శంకర, అగ్రి అడ్వైజర్ కమిటీ మెంబర్ పాటూరి లక్ష్మిరెడ్డి, వార్డ్ మెంబర్లు చిట్టా శాంత, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

మడకశిర : నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ పంచాయతీల్లో ఖాళీ పడిన వార్డు మెంబర్ స్థానాలకు గురువారం నామినేషన్లు దాఖలు చేశారు. అగలి పంచాయతీలో 2వ వార్డు అభ్యర్థిగా మూర్తి, పి,బ్యాడగెర పంచాయతీ 2వ వార్డ్ అభ్యర్థిగా శివలింగప్ప నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. గుడిబండ మండలంలోని గులేమూరు బాగల్ పంచాయతీ ఆచార్యపాలెంలో 10వ వార్డు స్థానానికి నామినేషన్ దాఖలు చేశారు. అగలి మండలంలో టిడిపి మద్దతుదారులుగా మండల కన్వీనర్ కుమారస్వామి, మాజీ సర్పంచ్ శివకుమార్, సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి జయన్న ఆధ్వర్యంలో నామినేషన్ దాఖలు చేశారు. గుడిబండ మండలంలో కన్వీనర్ మద్దనకుంటప్ప వీరశైవ లింగాయత్ సాధికార సమితి జిల్లా కన్వీనర్ దుర్గేష్, శివకుమార్, టిఎన్‌టియుసి తాలూకా అధ్యక్షుడు రాజు ఆధ్వర్యంలో నామినేషన్ దాఖలు చేయించారు.

రొద్దం : రొద్దం గ్రామపంచాయతీ పరిధిలోని 3వ వార్డు స్థానానికి గురువారం చివరి రోజు కావడంతో 8 నామినేషన్లు దాఖలయ్యాయని ఈఒఆర్‌డి కేశవరెడ్డి తెలిపారు.

పుట్టపర్తి రూరల్: మండలంలోని రాచువారి పల్లి పంచాయతీ పరిధిలోని ఎనిమిదవ వార్డు ఎన్నికకు పలువురు అభ్యర్థులు ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ల స్వీకరణ ఆఖరి రోజు కావడంతో ఎనిమిదో వార్డుకు రాచువారి పల్లి గ్రామానికి చెందిన ఎం సూర్యనారాయణ నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి అశోక్ కుమార్ రెడ్డి కి అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ విజయ్ కుమార్, సర్పంచి వెంకటప్ప, రాధాకృష్ణ, చంద్రశేఖర్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు: మండలపరిధిలోని తవళం పంచాయతీలోని 6వ వార్డు ఉప ఎన్నికకు తెలుగుదేశం పార్టీ మద్దతుదారులు గురువారం నామినేషన్లు దాఖలు చేశారు. మాచుపల్లి కృష్ణమూర్తి, మలిగ బయ్యా రెడ్డి నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ తొట్లిరెడ్డిశేఖరరెడ్డి, చారుపల్లి కృష్ణారెడ్డి, తవళం మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ రమణయ్య, వెంకటమల్ రెడ్డి, చెన్నక్రిష్ణ పాల్గొన్నారు.

అక్రమాలపై విచారణకు డిమాండ్

లేపాక్షి : స్థానిక మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాలలో జరిగిన అక్రమాలు, ప్రిన్సిపల్ వైఖరిపై సమగ్ర విచారణకు ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పాఠశాలలో 5, 6వ తరగతి అడ్మిషన్స్‌లో చాలా అవకతవకలు జరిగాయని, వాటిపై సమగ్ర విచారణ జరిపించాలని కోరామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మదిలేటి, నాయకులు వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగు నివారణ మందులు పంపిణీ

ప్రజాశక్తి-మడకశిర

పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో గురువారం డిప్యూటీ డిఎంహెచ్ఒ మంజువాణి విద్యార్థులకు నులి పురుగుల నివారణ మందులను పంపిణీ చేశారు. మొత్తం 470 మంది విద్యార్థులు సద్వినియోగం చేసుకు న్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ హెప్సిబా, ఎఎన్ఎం భారతి, హెల్త్ సూపర్‌వైజర్ బి.రాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. నులి పురుగుల నివారణ మందులతో కడుపులో నులి పురుగులు చనిపోయి, ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రొద్దం : జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా 1-19 ఏళ్ల లోపు ప్రతి ఒక్కరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి కృష్ణయ్య ఆదేశించారు. స్థానిక పిహెచ్‌సి పరిధిలోని కోగిర ఉన్నత పాఠశాల లో గురువారం డాక్టర్ ఎం.జగదీష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం రమాదేవి, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో 1-6 ఏళ్ల లోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేసినట్లు ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అనురాధ తెలిపారు.

గోరంట్ల రూరల్ : మండల పరిధిలోని అన్ని అంగన్వాడీ సెంటర్లలో 1-6 ఏళ్ల లోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. కమ్మలవాండ్లపల్లి అంగన్వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నాగరాణి పాల్గొని తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఎల్ హెచ్‌పి కరిష్మా, అంగన్వాడీ టీచర్లు వరలక్ష్మి, మంజుల, ఆశా వర్కర్ గౌతమి, తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అందించాలి

చిలమత్తూరు : మండల పరిధిలోని కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంపిపి పురుషోత్తమ రెడ్డి గురువారం పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం అందించక పోవడాన్ని గమనించిన ఆయన పర్యవేక్షణ అధికారి హెచ్‌ఎంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏజెన్సీ పనితీరు ఈ విధంగా ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.కోడిగుడ్డు పెంకు తొలిగించకుండా విద్యార్థులకు పంపిణి చేయడం నిర్లక్ష్యానికి అద్దం పడుతుందని అన్నారు. ఇప్పటికైన తీరు మార్చుకోక పోతే ఏజెన్సీపై చర్యలు తప్పవని హెచ్చరించారు. తాగునీటిని అందించే ఆర్వో ప్లాంట్ పాడవడంతో నీరు లేక ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు ఎంపిపి దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే ఆర్వో ప్లాంట్ కు మరమ్మతులు చేయించాలని హెచ్ఎంకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నరేష్‌క్రిష్ణ, సర్పంచి మురళీ, అశ్వర్థరెడ్డి పాల్గొన్నారు.

వేగవంతంగా ఓటర్ల ఇంటింటి సర్వే

పుట్టపర్తి అర్బన్ : ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా 2024 ను ఎలాంటి పెండింగ్ లేకుండా ఇంటింటి సర్వేని వేగవంతంగా చేస్తున్నామని కలెక్టర్ అరుణ్ బాబు రాష్ట్ర ఎన్నికల ప్రధాన కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనాకు వివరించారు. గురువారం అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఓటర్ల జాబితా పురోగతిపై నిర్వహించిన సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ పాల్గొన్నారు. ఈనెల 21వ తేదీ లోపు ఇంటింటి సర్వే పూర్తి చేయాలన్నారు. తదుపరి చేపట్టే కార్యాచరణ ప్రణాళిక పై సిఇఒ దిశ నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు డిఆర్ఒ కొండయ్య, ఆర్‌డిఒ భాగ్యరేఖ సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

హిందూపురం : యుటిఎఫ్ 50వ ఆవిర్భావ వేడుకలు గురువారం పట్టణంలోని ఎన్జీవో హోంలో యూటిఎఫ్ రాష్ట్ర నాయకులు మారుతీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మారుతీ శ్రీనివాస్, ఎప్‌జిఒ అధ్యక్షులు నరసింహులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం 50 సంవత్సరాల క్రితం యూటిఎఫ్ ఆవిర్భావం జరిగిందన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎన్నో సమస్యలను పరిష్కరించిందన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు గంగిరెడ్డి, మారుతి, బాబు, చెన్నకేశవులు, మహంతి, సుల్తాన్, రమణ, సురేష్, శ్రీనివాసులు, నంజప్ప పాల్గొన్నారు.

మడకశిర : పట్టణంలోని ఎంపిపి ఎస్‌కెపిలో యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వివిన్ మాలింగప్ప, టి.ముట్లగిరప్ప ఆధ్వర్యంలో యుటిఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా గౌరవాధ్యక్షులు కె.బూతన్న, గుడిబండ మండల అధ్యక్షులు నరసింహప్ప మాట్లాడుతూ ప్రభుత్వ విద్య బలోపేతానికి యుటిఎఫ్ నాయకులు, కార్యకర్తలు నిస్వార్థంగా కృషి చేస్తున్నారన్నారు. ఉపాధ్యాయుల హక్కుల కోసం నిరంతరం పోరాటాలు చేస్తున్నారన్నారు. ఇకనైనా ప్రభుత్వం ఉపాధ్యాయులపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని, సిపిఎస్‌ను రద్దు చేయాలని, జిఒ-117ను రద్దు చేసి ప్రభుత్వ బడులకు ప్రాణం పోయాలని డిమాండ్ చేశారు. అనంతరం సంఘ నాయకులు శ్రీసత్యసాయి శల్య చికిత్సాలయంలో రోగులకు బ్రెడ్లు పంపిణీ చేశారు.

హిందూపురంలో యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న నాయకులు

కార్యక్రమంలో ఉపాధ్యక్షులు జోగప్ప, కదిరి శ్రీనివాసులు, నంజప్ప, నరసింహమూర్తి, ఈశ్వర్, దేవరాజు, కదిరన్న, నరసింహరాజు, ఎన్.రామంజప్ప పాల్గొన్నారు.

పెనుకొండ : ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యుటిఎఫ్) 50వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం పట్టణంలో యుటిఎఫ్ జెండాను జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్, జిల్లా కార్యదర్శి నారాయణస్వామి ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, రవీంద్రనాథ్, నరేష్, కృష్ణనాయక్, రామకృష్ణనాయక్, ఎంకె నబి, ఉపేంద్ర, ఆదిజినేష్, రామాంజనేయులు, నాగేంద్ర, వలి, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యుటిఎఫ్ అలుపెరగని పోరాటాలు చేస్తోందని ఆసంఘం జిల్లా కోశాధికారి శెట్టిపి జయచంద్రారెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) 50వ ఆవిర్భావదినోత్సవాన్ని యూటీఎఫ్ నాయకులు గురువారం ఘనంగా జరుపుకున్నారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో యుటిఎఫ్ జిల్లాకోశాధికారి శెట్టిపి జయచంద్రారెడ్డి పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రభుత్వాస్పత్రిలో 86 మందికి బ్రెడ్లు, బిస్కెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్షమందికి పైగా సభ్యత్వమున్న ఏకైక సంఘం యుటిఎఫ్ అని అన్నారు.ఉపాద్యాయుల సమస్యలను పరిష్కరించడంలో యుటిఎఫ్ ముందు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రామకృష్ణనాయక్, ఆంజనేయులు, హరికృష్ణ, రామాంజినేయులు, హరిశంకర్, బిల్లేరామాంజినేయులు, గోపాల్‌రెడ్డి, బాలగొండ్ల శివయ్య, నాగేంద్రకుమార్, కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : పట్టణంలోనిబాలికోన్నత పాఠశాల ఆవరణలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి డి శ్రీనివాస్ అధ్యక్షతన యుటిఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. కదిరి ఎంఇఒ చెన్నకృష్ణ, కదిరి పురపాలక ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వర ప్రసాద్ రాజు , నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ కదిరి ప్రాంత యుటిఎఫ్ నాయకులు షఫీ, మహబూబ్ ఖాన్, రామచంద్ర రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మైనుద్దీన్, సుబ్బారెడ్డి, మల్లికార్జున , రాంప్రసాద్ నాయక్ , సుబ్బయ్య, ప్రసాద్, ఖాదర్‌బాషా, బ్రహ్మేంద్ర , ఖాజా పీర్, రవివర్ధన్ రెడ్డి, ఖాజా మోయోద్దీన్ జబివుల్లా, సుధాకం తదితరులు పాల్గొన్నారు.

పలువురు టిడిపిలో చేరిక

పుట్టపర్తి క్రైమ్ : మున్సిపాలిటీ పరిధిలోని కోవెలగుట్టపల్లికి చెందిన పలువురు వైసిపి యూత్ నాయకులు టిడిపిలో చేరారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఆధ్వర్యంలో వైసిపి యూత్ నాయకులు టిడిపిలో చేరారు. వారికి పల్లె టిడిపి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రత్నప్ప చౌదరి, కోవెలుగుట్టపల్లి సీనా, వైసిపి యూత్ నాయకులు రామయ్య, సురేష్, రాము, శ్రీకాంత్, కేశవ తదితరులు పాల్గొన్నారు.